ఈనాడు
యాదాద్రి భువనగిరి

గురువారం సెప్టెంబరు 26, 2024

సంత.. వానొస్తే చింత



యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: యాదగిరిగుట్టలో బుధవారం ఓ మోస్తారు వర్షం పడింది. పట్టణంలోని వారసంత చిత్తడిగా మారింది. వర్షం వల్ల కలిగిన బురదతో కొనుగోలుదారులు, అమ్మకందారులు పాట్లు పడ్డారు. వర్షం నీటితో పాటు మురుగు కాల్వల నీరు రావడంతో అసౌకర్యానికి గురవుతున్నారు. గత ప్రభుత్వ కాలంలో మంజూరైన సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మాణం నత్తనడకన సాగడంపై అసహనం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం చొరవ చూపి, త్వరితగతిన పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

బురద పక్కనే కూరగాయల అమ్మకం ఇలా..

దరఖాస్తుల ఆహ్వానం

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని జలాల్‌పురం గ్రామంలోని స్వామిరామానందతీర్థ గ్రామీణ సంస్థలో మేధా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలున్న కోర్సుల్లో శిక్షణ కోసం దరఖాస్తులను కోరుతున్నట్లు సంస్థ ఇన్‌ఛార్జి డైరెక్టర్ లక్ష్మీ బుధవారం తెలిపారు. ఆరు నెలల కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్ ఎలక్ట్రానిక్ వస్తువుల మరమ్మతు, సీసీటీవీ టెక్నీషియన్ కోర్సులకు పదో తరగతి విద్యార్హత, 6 నెలల ఎలక్ట్రీషియన్, సోలార్‌సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ సర్వీసింగ్ కోర్సుకు ఐటీఐ విద్యార్హత, ఆరు నెలల టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజీ, క్విల్ట్ బ్యాగ్‌ల తయారీ కోర్సుకు 8వ తరగతి విద్యార్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణ, వసతి ఉచితంగా ఉంటుందని, శిక్షణ అనంతరం కచ్చితమైన ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థుల ఈ నెల 30న సంస్థ ప్రాంగణంలో ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

బస్సు కావాలి..!



మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్

- మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ మార్గంలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఎక్స్‌ప్రెస్ బస్సులు లేవు. దీంతో మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.
- నల్గొండ నుంచి హైదరాబాద్‌కు సైతం ఎక్స్‌ప్రెస్ బస్సులు తక్కువగా ఉండడంతో.. కోదాడ నుంచి వచ్చే బస్సుల కోసం మహిళలు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది.
- మునుగోడు నియోజకవర్గానికి ఆర్టీసీ బస్సు రవాణాను పెంచేందుకు 21 మార్గాల్లో బస్సులు నడపాలని స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించారు.

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించిన నాటి నుంచి ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో ఉమ్మడి జిల్లాలో 60 శాతం ఉన్న ఓఆర్.. ప్రస్తుతం 100పైగా పెరిగింది. పండగలు, సెలవు దినాల్లో 120కి పైగా ఓఆర్ నమోదవుతుంది. ఈ నేపథ్యంలో కరోనా అనంతరం రద్దయిన అనేక మార్గాలతో పాటు పలు కొత్త మార్గాలకు సైతం బస్సులు నడపాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వాటితోనే.. ప్రధాన మార్గాలకు బస్సులు నడుపుతుండగా.. ఆయా మార్గాల్లోనే సర్వీసుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది.

అదనంగా అవసరం..

పాత మార్గాల పునరుద్ధరణ, కొత్త మార్గాలు, ప్రస్తుత మార్గాల్లో అదనపు సర్వీసుల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 200కు పైగా బస్సులు అవసరం పడనున్నాయి. వీటిలో మిర్యాలగూడ డిపోకు సుమారుగా 35, దేవరకొండకు 25, కోదాడకు 25, నల్గొండకు 30, సూర్యాపేటకు 35, యాదగిరిగుట్టకు 25, నార్కట్‌పల్లి డిపోకు 30 బస్సులు అదనంగా కావాలని స్థానిక నాయకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

పాతవి మార్చాలి..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల 79 కొత్త బస్సులు వచ్చాయి. ఇప్పటికే ఉన్న బస్సుల్లో 43 బస్సులను మార్చాల్సిన అవసరం ఉంది. నిబంధనల ప్రకారం 12 లక్షల కిలో మీటర్లు తిరిగిన, 15 ఏళ్లు దాటిన బస్సులను తుక్కుగా మార్చాల్సిన అవసరం ఉంది. బస్సుల లేమి కారణంగా తీసెయ్యాల్సిన బస్సులను సైతం నడిపిస్తున్న పరిస్థితి నెలకొంది. నల్గొండ డిపోకు ఇటీవలే కొత్త రాజధాని బస్సు రాగా.. మిర్యాలగూడ డిపోలో ఉన్న పాత రాజధాని బస్సు తరచూ మొరాయిస్తుంది. ఇటువంటి బస్సుల వల్ల నిర్వహణ ఖర్చు అధికమవుతుందని మెకానిక్‌లు చెబుతున్నారు. వీటి స్థానంలో కొత్త బస్సులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

ఉమ్మడి జిల్లాలో డిపోల వారీగా ఉన్న బస్సులు, కొత్తగా వచ్చిన వాటి వివరాలు..

డిపో	పల్లెవెలుగు	ఎక్స్‌ప్రెస్	డీలక్స్	సూపర్ లగ్జరీ	రాజధాని	కొత్త బస్సులు
దేవరకొండ	35	27	5	2	0	12
నల్గొండ	29	1	50	0	1	16
నార్కట్‌పల్లి	4	0	0	0	0	2
మిర్యాలగూడ	22	2	8	33	1	8
యాదగిరిగుట్ట	36+21 (మినీ)	16	0	0	0	10
కోదాడ	20	10	11	13	0	8
సూర్యాపేట	28	28	0	0	0	23

కొత్త బస్సులతో పాటు డ్రైవర్ల కోసం ప్రతిపాదనలు..

– రాజశేఖర్, ఆర్ఎం, నల్గొండ

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మరో 40 నూతన బస్సులకు ప్రతిపాదనలు పంపించాం. వీటితో పాటు 200 మంది డ్రైవర్ల నియామకానికి సైతం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. పాత మార్గాల నుంచి వినతులు వస్తున్నందున ఆదాయాన్ని బట్టి ఆయా మార్గాల్లో బస్సులు నడిపే అంశాన్ని సైతం పరిశీలించనున్నాం.



కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు (పాత చిత్రం)

చిన్నారి పెళ్లికూతురవుతోంది..!

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆడుతూ.. పాడుతూ హాయిగా చదువుకోవాల్సిన బాల్యాన్ని పసుపుతాడుతో బందీ చేస్తున్నారు. కుటుంబ పెద్దలే భవిష్యత్తును చిదిమేస్తున్నారు. మైనార్టీ తీరని పిల్లలకు మూడు ముళ్లు వేయించేందుకు సిద్ధమవుతున్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వారు అవగాహన రాహిత్యంతో తమ పిల్లలకు పెళ్లి చేసి భారాన్ని దింపుకొనేందుకు బాల్య వివాహాలు చేస్తున్నారు.

బలవంతంగా..

ఆడ సంతానం ఎక్కువగా ఉన్న పేద, మధ్య తరగతి కుటుంబాల వారు బాల్య వివాహాల వైపు మొగ్గు చూపుతున్నారు. తెలిసిన సంబంధమని మరికొంతమంది ముందడుగేస్తున్నారు. పిల్లలు వివాహాలు వ్యతిరేకించినా వారిపై ఒత్తిడి చేసి ఫిర్యాదులు చేయకుండా చేస్తున్నారు. కొంతమంది మైనర్లు భయపడకుండా అధికారులకు సమాచారం ఇస్తున్నారు. గిరిజన తండాలు, మూరుమూల పల్లెలో గుట్టుచప్పుడు కాకుండా చేస్తున్నారు.

☛ అధికారులకు సమాచారం అందడంతో బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు, చట్టం గురించి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

☛ 16, 17 ఏళ్లలోపు బాలికలు ఇంటర్మీయట్, డిగ్రీ చదువుతూ సామాజిక మాధ్యమాల్లో పరిచయమయ్యే వ్యక్తులకు బాగా ఆకర్షితులవుతున్నారు. ప్రేమ పేరుతో ఇంట్లో తెలియకుండా పెళ్లి చేసుకునే వరకు వెళ్తున్నారు. తెలిసీ తెలియని వయసులోనే పరిచయమైన వ్యక్తులను గుడ్డిగా నమ్ముతున్నారు.

☛ ఎలాంటి భయాందోళనలు లేకుండా బాల్య వివాహాలపై టోల్‌ఫ్రీ నెంబర్ 1098, 100 సమాచారం ఇవ్వవొచ్చు.

చట్టం ఏం చెబుతోంది

బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు నిండకుండా వివాహం చేస్తే అది బాల్య వివాహం అవుతుంది. బాల్య వివాహాలు జరిపించిన కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, ప్రోత్సహించినవారు, పెళ్లికి హాజరైన వారు సైతం బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం శిక్షార్హులు అవుతారు.

◆ దేవాలయాల్లో పెళ్లిళ్లు జరిపించే పురోహితులు, పెద్దలుగా ఉండేవారిపై కేసులు నమోదు చేస్తారు. ఈ చట్టం కింద కేసులు నమోదైన వారికి న్యాయస్థానాల్లో రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంటుంది.

ఇటీవల ఘటనలు ఇలా..

✧ మోటకొండూరు మండలం తేరాల గ్రామంలో 16 ఏళ్ల బాలికకు వివాహం చేసేందుకు ఆగస్టు 16న ఏర్పాట్లు చేస్తుండగా బాలల పరిరక్షణ అధికారులు అడ్డుకున్నారు. బాలిక తల్లిదండ్రులది జనగాం జిల్లా బచ్చన్నపేట. గతంలో అక్కడ వివాహం చేసేందుకు ప్రయత్నం చేయగా అధికారులు అడ్డుకున్నారు. మరోసారి అధికారులకు తెలియకుండా మేనమామ ఊరు తేరాలలో పెళ్లి చేస్తుండగా అధికారులకు సమాచారం వచ్చింది. వివాహం నిలిపివేసి కౌన్సెలింగ్ ఇచ్చారు.

నిలిపివేసిన బాల్య వివాహాలు..



సంవత్సరం	నమోదైన కేసులు
2022	0
2023	5
2024 ఆగస్టు	2

✧ వలిగొండ మండలం వేములకొండలో 16 ఏళ్ల బాలికలకు వివాహం చేస్తుండగా అధికారులు నిలిపివేశారు. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం ఎదులాబాద్‌కు చెందిన బాలికను జనగాం జిల్లాకు చెందిన 30 ఏళ్ల వ్యక్తితో వివాహం చేసేందుకు చూశారు.

యాదాద్రి క్షేత్రంలో హోమం.. కల్యాణం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో బుధవారం స్వయంభువులైన శ్రీలక్ష్మీనరసింహ మూర్తులను కొలుస్తూ చేపట్టిన నిత్యారాధనలు ఆలయ ఆచారంగా కొనసాగాయి. సూర్యోదయానికి ముందస్తు వేళ సుప్రభాతం చేపట్టిన పూజారులు, రాత్రి శయనోత్సవం నిర్వహించారు. బిందె తీర్థం, హారతి, బాలభోగం నివేదించారు. మూలవరులకు హారతినిచ్చి నిత్యపూజలు జరిపి, పంచామృతంతో అభిషేకం, తులసీ దళాలతో అర్చన చేపట్టారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి కవచమూర్తులకు సువర్ణ పుష్పార్చన జరిపారు. ఆలయ మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులకు సువర్ణ పుష్పార్చన పర్వాలు కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం విశ్వక్సేన పూజతో నిర్వహించారు. అలంకార సేవ ఉత్సవాన్ని జరిపారు. జోడు సేవలను మంగళ వాయిద్యాల మధ్య చేపట్టారు. రాత్రి వేళ ఆరాధన నిర్వహించి, ప్రత్యేక అర్చన చేశారు. దర్బార్ సేవోత్సవంలో నిత్యాదాయం వెల్లడించారు. వివిధ విభాగాల ద్వారా రూ.8,71,022 చేకూరిందని ఈవో తెలిపారు.



శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న పూజారి

ఆదుకునే.. ఆధునిక మోకు



నందనంలో గీతకార్మికులకు అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ సైదులు

వలిగొండ, భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికుల ఆరాధ్య దైవం కాటమరాజు పేరుతో భద్రత కోసం సేఫ్టీ మోకులను ప్రవేశపెట్టింది. కల్లు గీసే క్రమంలో పలుమార్లు గీత కార్మికులు చెట్టుపై నుంచి కందపడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. పని భద్రత కల్పించడానికి నిపుణులతో రూపొందించిన కిట్లను వెనకబడిన తరగతుల (బీసీ) కార్పొరేషన్ ద్వారా విడతల వారీగా పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేపట్టింది. గౌడ వృత్తిదారులకు "కాటమయ్య రక్షక కవచం" వెన్నుదన్నుగా నిలవనుంది.

☛ యాదాద్రి భువనగిరి జిల్లాలో 345 గీత కార్మికుల సొసైటీలు, 19,665 వేల మంది గీత కార్మికులు ఉన్నారు. జిల్లాకు 400 సేఫ్టీ మోకులు మంజూరయ్యాయి. వీటిని పంపిణీ చేసేందుకు ఇప్పటికే 125 మందికి శిక్షణ పూర్తి చేశారు. మరో 275 మందికి శిక్షణ పూర్తయిన తర్వాత పంపిణీ చేయనున్నారు.

☛ భువనగిరి మండలం నందనం, యాదగిరిగుట్ట, ఆలేరు మండలం కొలనుపాకలో సేఫ్టీమోకులపై ఇద్దరు నిపుణులు గీత కార్మికులకు అవగాహన కల్పిస్తున్నారు.

☛ రక్షక కిట్‌లో గీత కార్మికులు చెట్లు ఎక్కినప్పుడు కింద పడకుండా, మోకు జారకుండా ఉండేందుకు దృఢమైన బెల్ట్‌తాడు, మరో మూడు క్లిప్పులు ఉన్నాయి. గతంలో మోకు జారితే కింద పడేవారు. కిట్టు ధరిస్తే తాడు కింద పడకుండా నిలువరిస్తుంది. దీంతో ప్రాణాపాయం తప్పుతుందని నిపుణులు చెబుతున్నారు.

సేఫ్టీ మోకులతో రక్షణ

– పి.సైదులు, సూపరింటెండెంట్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ

తాటి చెట్లు ఎక్కే సమయంలో జరిగే ప్రమాదాల నివారణకు గీత వృత్తిదారులకు సేఫ్టీ మోకులు ధరించడం వల్ల రక్షణ ఉంటుంది. చెట్టు మీద నుంచి అకస్మాత్తుగా జారినా తీవ్రమైన ప్రమాదం జరగకుండా ఉంటుంది. ప్రభుత్వం అందించే పరికరాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి గీత కార్మికుడికి ఆధునిక మోకులపై శిక్షణ ఇచ్చి విడతల వారీగా పంపిణీ చేస్తాం.

కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి అడుగంటింది

◆ మాజీ మంత్రి మల్లారెడ్డి

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: రెవెన్యూ, నీటిపారుదల, పురపాలక శాఖలు ఉన్నాక హైడ్రా ఎందుకు, ఇదంతా ప్రజల ఆలోచన పక్కదారి పట్టించేందుకేనని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి విమర్శించారు. యాదాద్రి క్షేత్రాన్ని మల్లారెడ్డి సతీ సమేతంగా బుధవారం సందర్శించారు. దైవ దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. మార్కింగ్ చేసి నోటీస్ ఇవ్వండి. ఆ తర్వాత తొలగించండి. ప్రజా జీవితాలను గందరగోళంలో పడేయకండని ఆయన సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో అన్ని రంగాలలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి అడుగంటిపోయింది, హామీలు అమలు చేసే సామర్థ్యం, చిత్తశుద్ధి ఈ పాలకులకు లేదని ప్రజలు గ్రహించారన్నారు. దైవారాధనలో పాల్గొన్న మాజీ మంత్రి దంపతులు పండితులతో ఆశీస్సులు పొందారు. ఆలయ అధికారులు దేవుడి ప్రసాదం అందజేశారు.



యాదాద్రి క్షేత్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి మల్లారెడ్డి దంపతులకు ఆశీస్సులు అందజేస్తున్న వేదపండితులు

హోమియో.. వైద్యులేరీ

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు మండలం కొలనుపాకలోని హోమియో డిస్పెన్సరీ మూతపడింది. తొమ్మిదేళ్లుగా పనిచేసిన వైద్యురాలు డాక్టర్ బి.లలిత పదోన్నతిపై మేడ్చల్ జిల్లాకు బదిలీ కాగా కిందటి నెల ఆగస్టు 12న రిలీవ్ అయ్యారు. దాదాపు నెలన్నర రోజులు గడిచినా వైద్యుడి నియామకం జరగలేదు. నిత్యం ఇక్కడ 150-200 మంది వరకు బయటి రోగులు వైద్య సేవలు పొందేవారు. ఆలేరు, రాజపేట, బచ్చన్నపేట, జనగామ మండలాల నుంచి రోగులు ఇక్కడికి వస్తుంటారు. వైద్యురాలు బదిలీపై వెళ్లిన నాటి నుంచి వైద్యసేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సత్వరం వైద్యుల నియామకం చేయాలని కోరుతున్నారు.



కొలనుపాకలో మూతపడిన హోమియో డిస్పెన్సరీ

ఎంఈవోలు వచ్చేశారు..!

సీనియర్ జీహెచ్‌ఎంలకు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే : నాలుగైదు మండలాలకు ఒక్కరే ఎంఈవోగా పనిచేస్తున్న విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. నోడల్ అధికారులుగా ఉన్న సీనియర్ జీహెచ్‌ఎంలకే మండల విద్యాధికారులుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ తాజాగా పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవీ.నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో దాదాపు 19 ఏళ్లుగా నెలకొన్న వివాదానికి తెర పడినట్లయింది.

✤ జిల్లాలో ప్రస్తుతం ఒక్క ఎంఈవో కూడా రెగ్యులర్‌గా లేకపోవడం విచారకరం. కేవలం ముగ్గురు మాత్రమే ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా 17 మండలాలకు బాధ్యతలు చూస్తుండగా, అందులో ఇద్దరు ఇటీవల ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. బదిలీ అయిన ఇన్‌ఛార్జి ఎంఈవోల బాధ్యతలు సైతం చూడాల్సి వచ్చేది.

✤ తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో 17 మంది సీనియర్ హెచ్‌ఎంలు ఎంఈవోలుగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఫలితంగా పర్యవేక్షణ మెరుగుపడి విద్యా వ్యవస్థ గాడిలో పడే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో 2005 తర్వాత ఎంఈవోల నియామకం నిలిచిపోయింది.

మండలాల వారీగా ఎంఈవోల వివరాలు..

మండలం	ఎంఈవో
అడ్డగూడూరు	ఎన్.సబిత
ఆలేరు	ఏ.లక్ష్మీ
ఆత్మకూర్(ఎం)	కె.మహదేవ రెడ్డి
భువనగిరి	పి.నాగవర్ధన్ రెడ్డి
బీబీనగర్	జి.సురేశ్‌రెడ్డి
బొమ్మలరామారం	డి.రోజారాణి
చౌటుప్పల్	గురువారావు
గుండాల	అగ్గి రాములు
మోటకొండూరు	కె.రఘురామరెడ్డి
మోత్కూరు	టి.గోపాల్ రెడ్డి
సంస్థాన్ నారాయణపురం	జి.శ్రీనివాసులు
భూదాన్ పోచంపల్లి	పి.ప్రభాకర్
రాజపేట	చందా రమేశ్
రామన్నపేట	జి.జ్యోతి
తుర్కపల్లి	వి.మాలతి
వలిగొండ	భాస్కర్
యాదగిరిగుట్ట	కె.శరత్‌యామినీ


ఉన్నవారిపైనే అదనపు పని భారం..

17 మండలాల బాధ్యతలు కేవలం ముగ్గురే చేపడుతుండటంతో ఉన్న వారిపై పనిభారం ఎక్కువగానే పడిందని చెప్పవచ్చు. ముఖ్యంగా విద్యార్థుల నమోదు, ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షల మార్కులను ఆన్‌లైన్ చేయడం, పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ, నెలవారీగా ఇండెంట్ చూడటం, మన ఊరు, మనబడి పర్యవేక్షణ, బిల్లుల తయారీ, డిజిటల్ బోధన నిర్వహణ, మధ్యాహ్నభోజనం వంటి బాధ్యతలు నిర్వహించాల్సి వచ్చేది. ఇవే కాక జిల్లా విద్యాధికారుల ఆదేశాలు, ఇతర సమావేశాల నిర్వహణ చేపట్టాల్సి ఉండేది. ముఖ్యంగా కాంప్లెక్స్ పరిధిలో సమావేశాల నిర్వహణ, ఉపాధ్యాయుల వేతనాల బిల్లులు, ప్రైవేటు పాఠశాలల తనిఖీలు తదితర బాధ్యతలను చేపట్టాల్సి వచ్చేది.



రాజపేటలోని ఓ పాఠశాలలో పాఠాలు ఆసక్తిగా వింటున్న విద్యార్థులు (పాతచిత్రం)

భరోసాతో.. దసరా పండగేనా..!




అడవిదేవులపల్లిలో సాగు చేసిన పత్తిచేను

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: తమ ప్రభుత్వ హయాంలో భారాస రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లలో పంట సాయం కోసం రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రైతు భరోసాగా మార్పు చేసింది. ఈ పథకం కింద ఆర్థిక సాయం జులైలోనే అందించాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల తాత్సారం చేస్తూ వచ్చింది.

● ఆగస్టు 15 నుంచి రుణమాఫీ మూడు విడతలుగా చేసినా.. ఇంకా చాలా మంది రైతులకు సొమ్ము అందలేదు. మాఫీ అయిన వారికి సైతం చాలా వరకు ఇంకా బ్యాంకుల చుట్టూ తిరిగినా రుణాలు ఇవ్వలేదని రైతులు చెబుతున్నారు. ఈ క్రమంలో అక్టోబరులో రైతుభరోసా ఇవ్వనున్నామని ప్రభుత్వ పెద్దలు అంటుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ పంట కాలం మరో 15 రోజుల్లో ముగియనుంది. పంట మొదట్లో ఇవ్వాల్సిన ఆర్థిక సాయం కనీసం చివర్లోనైనా ఇస్తే బాగుండని ఉమ్మడి జిల్లాలోని 23.73 లక్షల మంది రైతుల ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన రైతులు, సాగు విస్తీర్ణం వివరాలు..



పెరుగుతుందన్న ఆశ

అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15వేల రైతుభరోసా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఎన్నికల సమయంలో గత ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడానికి నిధులు సిద్ధం చేయగా ఎన్నికల సంఘం నిలిపివేసింది. ఇక అప్పటి నుంచి రైతు భరోసా రైతులకు అందలేదు.

● తాజా ప్రభుత్వం దసరాకు భరోసా ఇస్తామంటోంది. ప్రస్తుతం మరో నెల రోజుల్లో రబీ సీజన్ కూడా మొదలవుతోంది. రెండు పంటలవి కలిపి ఎకరాకు రూ.15వేలు జమ చేస్తుందా లేక ఖరీఫ్‌వి మాత్రమే జమ చేస్తుందా అన్న దానిపై స్పష్టత లేదు.

మార్గదర్శకాలపై ఆందోళన

ఇక ప్రభుత్వం రైతు భరోసా నిధుల జమకు సంబంధించిన మార్గదర్శకాలు ఏ విధంగా ఉండబోతున్నాయనే దానిపై రైతులు ఆందోళనలో ఉన్నారు. ముఖ్యంగా సన్నకారు రైతులకు ఎలాంటి ఢోకా లేకున్నా పెద్దకారు రైతుల్లో మాత్రం ఆందోళన ఉంది. కటాఫ్ ఎన్ని ఎకరాలు ఉండబోతుందో అన్న సందేహాలున్నాయి.

● ప్రభుత్వం పదెకరాల్లోపు ఉన్న రైతులకు మాత్రమే ఇస్తే మిగతా వారికి రైతు భరోసా దూరం కానుంది. ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నవారికి కూడా రైతు భరోసా కోత పెట్టాలన్న యోచనతో ప్రభుత్వం ఉందని రైతులు భావిస్తున్నారు. ఇలాంటి వాటన్నిటికీ నెలాఖరులోపు స్పష్టత వచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

అవగాహనతోనే హెచ్‌ఐవీ నిర్మూలన

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌ని అవగాహనతోనే నిర్మూలించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ యశోద అన్నారు. హెచ్‌ఐవీ అవగాహన కార్యక్రమంలో భాగంగా భువనగిరి జూనియర్ కళాశాల విద్యార్థులకు యూత్ ఫెస్ట్ రెడ్‌రన్ మారథాన్ నిర్వహించారు. హెచ్‌ఐవీ వ్యాప్తి పట్ల విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం రన్‌లో విజేతలుగా నిలిచిన ముగ్గురికి నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ వ్యాధి నియంత్రణాధికారిణి డాక్టర్ సాయిశోభ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శిల్పిని, డీపీసీ సంపతయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.



యూత్ ఫెస్ట్ రెడ్‌రన్ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ యశోద

యాదాద్రి లడ్డూ ప్రసాదాల్లో పూర్తి నాణ్యత

మదర్ డెయిరీ ద్వారా నెయ్యి సరఫరా
యంత్రాలతో నిత్యం తయారీ
ఆలయ ఈవో భాస్కరరావు వెల్లడి



లడ్డూ ప్రసాదం తయారీని పరిశీలిస్తున్న ఆలయ ఈవో భాస్కరరావు



లడ్డూ ప్రసాదాలు



నెయ్యి

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: 'తెలంగాణలో ప్రసిద్ధి చెందిన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్ర ప్రాధాన్యం, విశిష్టతలను మరింత పెంచే దిశగా దేవుడి ప్రసాదాల తయారీలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, భక్తులకు విక్రయిస్తున్నాం'.. అని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి భాస్కరరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

'యాదాద్రి క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులు లడ్డూ ప్రసాదాల కొనుగోలుకు అత్యంత ఆసక్తి చూపిస్తారు. నమ్మక, విశ్వాసాలకు తగ్గట్లే నాణ్యతలో ఎలాంటి లోపం జరగకుండా దినుసులను ప్రభుత్వ సంబంధిత శాఖ ధ్రువీకరణతోనే ప్రసాదాల తయారీకి వినియోగిస్తున్నాం. నిత్యం వంద గ్రాముల లడ్డూలను 25 వేల నుంచి 28 వేల వరకు తయారీ చేస్తున్నాం. ఇంకా అవసరమైతే అప్పటికప్పుడు సిద్ధం చేసే సామర్థ్యం యంత్రాల ద్వారా ఉంది. లడ్డూ తయారీకి మదర్ డెయిరీ ద్వారా కేజీ రూ.609 నెయ్యిని అవసరానికి తగ్గట్లు తెప్పించుకుంటాం. ఆ నెయ్యిని వెంటనే టెస్టింగ్ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని డెయిరీ నిర్వాహకులు పంపిస్తారు. వచ్చిన నెయ్యి నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునేందుకు నాచారంలోని ప్రభుత్వ ల్యాబ్‌కు పంపిస్తున్నాం' అని పేర్కొన్నారు.

భోగ్ సర్టిఫికెట్:

ఈ క్షేత్రంలో విక్రయించే ప్రసాదాలు పూర్తి నాణ్యతా ప్రమాణాలు కలిగినవని చెప్పడానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ పరిధిలోని ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏ) జాతీయ సర్టిఫికెట్ భోగ్ (బ్లిస్‌ఫుల్ హైజీన్ ఆఫరింగ్ టు గాడ్) గుర్తింపు ఉంది.

చిరు ధాన్యాలతో:

చిరు ధాన్యాలతో తయారీ చేసే లడ్డూ ప్రసాదాలను విక్రయిస్తారు. 80 గ్రాముల మిల్లెట్స్ లడ్డూ ధర రూ.40, ఇక 200 గ్రాముల బరువు కలిగిన పులిహోర ప్రసాదం రూ.30, 500 గ్రాముల బరువు కలిగిన పెద్ద లడ్డూ రూ.150కి విక్రయిస్తారు.

లడ్డూ తయారీకి వాడే సరకులు:

లడ్డూ ప్రసాదం తయారీకి శాస్త్ర రీత్యా వాడే సరకులను దిట్టం అంటారు. ఒక కేజీ లడ్డూకు నెయ్యి 900 గ్రాములు, చక్కెర 2 వేల గ్రాములు, శనగపిండి వెయ్యి గ్రాములు, కాజు 75 గ్రాములు, కిస్మిస్ 50 గ్రాములు, ఇలాచి 10 గ్రాములు, పచ్చ కర్పూరం రెండు గ్రాములు, జాజికాయ రెండు గ్రాములు.

◆ పై దినుసుల ద్వారా వంద గ్రాముల లడ్డూ 45 తయారవుతాయి. ఈ ఆలయ లడ్డూ రుచి, నాణ్యత తగ్గకుండా, ఐదు రోజుల నుంచి ఒక వారం రోజుల వరకు నిల్వ ఉంటుంది.

అరచేతిలో.. అంతర్జాలంలో..

ఎస్పీడీసీఎల్ యాప్ ద్వారా 19 రకాల సేవలు

రోజురోజుకూ సాంకేతిక వినియోగం పెరుగుతుండటంతో ప్రభుత్వ రంగ సంస్థలు అటువైపు అడుగులు వేస్తున్నాయి. విద్యుత్తు శాఖలోనూ సాంకేతికతను జోడించారు. బిల్లు చెల్లింపుతో పాటు 19 రకాల సేవలను చరవాణి ద్వారా అందించడానికి 'ఎస్పీడీసీఎల్' అనే యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

–భానుపురి, న్యూస్‌టుడే:

డౌన్‌లోడ్ ఇలా..

ఎస్పీడీసీఎల్ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ- మెయిల్ ఐడీతో లాగిన్ అవ్వాలి. యూఎస్సీ సంఖ్యను నమోదు చేయగానే తెర మీద పలు అంశాలతో కూడిన ఎంపిక కనిపిస్తుంది. వీటిలో సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చు. కాకుండా అది పరిష్కారమైందో లేదో తెలుసుకోవచ్చు.

ముందే బిల్లు తెలుసుకోవచ్చు

ప్రతి నెల మీటర్ రీడింగ్ ప్రకారం ఎన్ని యూనిట్ల కరెంటు వినియోగించారు.. ఎంత బిల్లు వస్తుందో చాలా మందికి అవగాహన ఉండదు. యాప్ ద్వారా ఎన్ని యూనిట్లకు ఎంత బిల్లు వస్తుందనే వివరాలు ముందుగానే తెలుసుకోవచ్చు. ఆధార్ లింక్, చరవాణి నంబరు నమోదుతో యాప్‌లోనే విద్యుత్తు బిల్లు చెల్లించటంతోపాటు గతంలో చెల్లించిన బిల్లులను సైతం చూసుకోవచ్చు.

ఫిర్యాదు.. సూచనలు

వినియోగదారుడి పేరు, లోడు, మార్పు, టారిఫ్ వివరాలు, ఏ కేటగిరికీ ఎంత ఛార్జి, గృహ, గృహేతర, పరిశ్రమలకు ఎంత బిల్లు వసూలు చేస్తారు అనే విషయాలు తెలుసుకోవచ్చు. విద్యుత్తును ఎలా పొదుపు చేయాలి. ఎక్కడైనా ఏదైనా ప్రమాదం జరిగితే జీపీఎస్ లోకేషన్ ఆధారంగా చరవాణిలో ఫొటో తీసి పంపి దాని వివరాలు నమోదు చేస్తే సంబంధిత అధికారికి వెళ్తుంది. వారు స్పందించి చర్యలు తీసుకుంటారు. కరెంటు ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ఫీడ్‌బ్యాక్‌తోపాటు అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన టోల్‌ఫ్రీ నంబరును కూడా యాప్‌లో పొందుపరిచారు. వినియోగదారుడు తన సమస్యను ఫిర్యాదు ద్వారా అధికారులకు తెలపవచ్చు. ఇందుకు మీటర్ నంబరుతో సమస్యను నమోదు చేసి పంపించాలి.



వివిధ రకాల సదుపాయాలు కలిగిన యాప్

ఆత్మహత్య కాదు.. హత్యాచారమే: డీఎస్పీ

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: ప్రేమించిన యువతి అడ్డుతొలగించుకునేందుకు ఆమెపై మరికొందరితో అత్యాచారం చేసి పాశవికంగా హత్య చేసిన కేసులో రూపావత్ నాగు, రూపావత్ బుజ్జి, రమావత్ క్రాంతికుమార్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు తెలిపారు. కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

◆ దామరచర్ల మండలం పుట్టలగడ్డ గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతిని అదే గ్రామానికి చెందిన రూపావత్ నాగు రెండేళ్లుగా ప్రేమ పేరుతో నమ్మించి శారీరకంగా కలిసి రెండు సార్లు గర్భస్రావం చేయించాడు. ఈ విషయమై యువతి తల్లిదండ్రులు నాగు తల్లిదండ్రులను కలిసి వివాహం జరిపించాలని కోరగా అందుకు అంగీకరించలేదు. కొంతకాలంగా నాగు సదరు యువతి చరవాణి నంబరును బ్లాక్ చేసి దూరం పెడుతున్నాడు.

◆ ఈనెల 14న సదరు యువతి నాగు వద్దకు వెళ్లి పెళ్లి చేసుకోవాలని నిలదీసింది. యువతిని మాయమాటలతో నమ్మించిన రూపావత్ నాగు అతని తల్లి బుజ్జి, బావ రమావత్ క్రాంతికుమార్‌లు ఊరిబయట మాట్లాడేందుకు తీసుకెళ్లారు.

◆ అక్కడ బుజ్జి కాపలా ఉండగా నాగు, క్రాంతి కుమార్‌లు యువతిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడి.. గొంతు నొక్కి చంపి చెట్టుకు వేలాడదీసి సదరు యువతి బలవన్మరణానికి పాల్పడినట్లు చిత్రీకరించారు. 15వ తేదీ ఉదయం యువతి మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు అనుమానంతో విచారణ చేపట్టగా హత్యాచారం విషయం వెలుగు చూసింది.

◆ బుధవారం ఉదయం వాడపల్లి ఎస్సై రవి జాన్‌పహాడ్ రోడ్డుపై వాహనాలు తనిఖీ చేస్తుండగా రూపావత్ నాగు, బుజ్జి, రమావత్ క్రాంతిలు కనిపించగా.. అదుపులోకి తీసుకున్నారు. కాగా ఇదే కేసులో పలువురు అనుమానితులపై విచారణ జరుపుతున్నామని డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. కేసు విచారణ వేగంగా పూర్తి చేసిన గ్రామీణ సీఐ వీరబాబు, వాడపల్లి ఎస్సై రవి సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్ రాజు, సీఐ వీరబాబు

పోగు పోసుకుంటున్న జీవితాలు

చండూరు, న్యూస్‌టుడే: అక్షరాలు నేర్వకపోయినా.. గడ్డి పరకల కలయికను చూసి పడుగు పేకలు కలిపి మానవ ప్రపంచానికి వస్త్రాలు నేస్తూ చేనేత రంగంలో రాణిస్తున్నారు చండూరుకు చెందిన పలువురు చేనేత మహిళలు. ఆ రంగానికి ఆదరణ తగ్గి ఉపాధి అంతంతమాత్రంగానే ఉన్నా.. కులవృత్తిని వీడలేక.. వేరే పని చేయలేక.. కుటుంబానికి ఆసరాగా ఉంటుందని మరికొందరు.. వృత్తిని చేపడుతున్నారు.

ఉపాధి కల్పిస్తున్నాం...

– చిలుకూరి యశోద

మాది చండూరు. భర్త చిలుకూరి రామకృష్ణ సుమారు 50 మందికి మగ్గం పని అప్పగిస్తారు. దీంతో ఆ 50 కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. వీరితో పాటు అదనంగా మరో 10 మంది మహిళలు చిటికిలు కట్టడం, రంగులు అద్దడం, డిజైన్‌లు గీయడం, మగ్గం నేయడం వంటి పనులు చేస్తుంటారు. వారితో పాటు నేను కూడా నేత పని చేస్తూ డిజైన్లు గీస్తుంటాను. మేము రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి చేనేత చీరలు తయారు చేస్తుంటే ప్రింటెడ్ కంపెనీలు యథేచ్ఛగా మార్కెట్లలోకి వస్తున్నాయి. దీంతో మా వస్త్రాలు ఖరీదు కావడం లేదు. దీంతో మాపై ఆధారపడిన చేనేత కుటుంబాలకు పని కల్పించడం భారంగా మారింది.



ఆర్థిక ఇబ్బందులు లేవు

– ప్రసన్న



నా భర్త ప్రైవేట్ వ్యాపారం నిర్వహిస్తుంటారు. ఆయనకు వచ్చే సంపాదనతో కుటుంబం గడవడం కష్టంగా ఉంది. దీంతో 14 ఏళ్లుగా మాస్టర్ వీవర్‌ల వద్ద చేనేత పని (రంగులు అద్దడం, చిటికిలు కట్టడం, డిజైన్‌లు గీయడం) చేస్తుంటాను. రోజు ఎనిమిది గంటలు పని చేస్తే రూ. 600 చెల్లిస్తారు. ప్రతి రోజు పని దొరుకుతుంది. నేను మా భర్త ఇద్దరం పని చేయడం వల్ల ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేవు.

భర్తకు తోడుగా...

–గజం పల్లవి



నేను, నా భర్త ఇద్దరం చండూరుకు చెందిన మాస్టర్ వీవర్ చిలుకూరి రామకృష్ణ దగ్గర పని చేస్తుంటాం. ఇద్దరికి రోజూ చెరో రూ.600 చొప్పున కూలీ చెల్లిస్తుంటారు. గతంలో మేం సొంతంగా చీరలు తయారు చేసే వాళ్లం. చేనేత వస్త్రాలకు ఆదరణ తగ్గడంతో పెట్టుబడి పెట్టలేక వేరే పని చేయలేక మా కులవృత్తి వీడలేక మాస్టర్ వీవర్ వద్ద పని చేస్తూ కుటుంబాన్ని గడుపుతున్నాం.

ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు 28న

ఆలేరు, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ అండర్-17 నల్గొండ ఉమ్మడి జిల్లా బాలురు, బాలికల జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 28న ఆలేరులో జరుగుతాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బెజ్జం బాలకృష్ణ బుధవారం ఆలేరులో చెప్పారు. పోటీలలో పాల్గొనే వారు 01.01.2008 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఆసక్తిగల వారు ఉదయం 9గంటలకు ఆలేరు జడ్పీఉన్నత పాఠశాల క్రీడా మైదానానికి చేరుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి జి. మధుసూదన్ 9000989671 చరవాణి నెంబరులో సంప్రదించాలన్నారు.

ఉమ్మడి జిల్లాలో 12 మంది ఎస్సైలకు స్థానచలనం

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో 12 మంది ఎస్సైలకు స్థాన చలనం జరిగింది. ఈ మేరకు బుధవారం డీఐజీ కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ కార్యాలయాలకు ఆదేశాలు జారీ అయ్యాయి. బదిలీ అయిన ఎస్సైల వివరాలు ఇలా ఉన్నాయి.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
యస్‌కే యాకూబ్	వీఆర్ సూర్యాపేట	డీసీఆర్‌బీ సూర్యాపేట
వి.మహేశ్వర్	డీఎస్‌బీ నల్గొండ	డీఎస్‌బీ సూర్యాపేట
వీ.వెంకటేశ్వర్లు	వీఆర్ నల్గొండ	డీఎస్‌బీ సూర్యాపేట
యస్‌కే సైదులు	డీసీఆర్‌బీ నల్గొండ	కోదాడ టౌన్
ఎస్.కృష్ణయ్య	మిర్యాలగూడ టౌన్	మాడ్గులపల్లి
జీ.శోభన్‌బాబు	మాడ్గులపల్లి	వీఆర్ నల్గొండ
డి.వెంకటేశ్వర్లు	డీసీఆర్‌బీ సూర్యాపేట	వేములపల్లి
డి.విజయ్ కుమార్	వేములపల్లి	వీఆర్ నల్గొండ
పి.లోకేశ్ కుమార్	సూర్యాపేట వన్ టౌన్	మిర్యాలగూడ రూరల్
ఎన్.సందీప్‌రెడ్డి	నల్గొండ వన్ టౌన్	మిర్యాలగూడ రూరల్-2
వి.శేఖర్	మిర్యాలగూడ వన్ టౌన్	అడవిదేవులపల్లి
బి.సాయిప్రశాంత్	సీసీఎస్ సూర్యాపేట	తిప్పర్తి

ప్రమాదవశాత్తు కాలువలో పడి ఇద్దరి గల్లంతు

నిడమనూరు, న్యూస్‌టుడే: సాగర్ ఎడమకాలువలో దుస్తులు ఉతికే క్రమంలో ప్రమాదవశాత్తు అందులో పడి యువతీయువకుడు గల్లంతైన ఘటన నిడమనూరు మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ప్రత్యక్షసాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. త్రిపురారానికి చెందిన వేమవరపు సాయి(25) సొంతగ్రామంలో కూరగాయాల దుకాణం నడిపిస్తున్నాడు. అతడు వచ్చేవారంలో భవాని మాలధారణ చేయాలనే ఉద్దేశంతో ఇంట్లోని దుస్తులను ఉతకడానికి తనకు సాయంగా అతడి దుకాణంలో పనిచేస్తున్న త్రిపురారానికి చెందిన మేదరి శైలజ(30), అవిరెండ్ల రమాదేవిలను తీసుకుని సాయంత్రం నాలుగున్నరకు బొక్కమంతలపహడ్ సమీపంలోని ఎడమకాలువ వద్దకు వెళ్లాడు. కాలువ మెట్ల మీద నిలబడి దుస్తులు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు శైలజ, సాయి కాలువలో జారి పడ్డారు. నీటి ఉద్ధృతికి వారు కొట్టుకుపోతుండగా.. వారిని కాపాడేందుకు ప్రయత్నించిన రమాదేవీ కాలువలో పడింది. ముగ్గురు కొట్టుకుపోతుండగా కాలువపై అక్కడే ఉన్న స్థానికుడు ధర్మారపు జానయ్య.. ధర్మారపు సైదులు సాయంతో రమాదేవికి చీర అందించి కాపాడారు. మిగిలిన ఇద్దరిని కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సాయికి కొన్నేళ్ల క్రితం వివాహం కాగా.. కుమారుడు ఉన్నాడు. మనస్పర్థల కారణంగా అతడి భార్య కొన్ని రోజులుగా పుట్టింటి వద్దే ఉంటోంది. గల్లంతైన మరో మహిళ మేదరి శైలజకు వివాహమై ముగ్గురు కుమార్తెలున్నారు. ఆమె భర్త జానయ్య సుతారి మేస్త్రీగా పనిచేస్తున్నాడు. నిడమనూరు ఎస్సై గోపాల్‌రావు, ఏఎస్సై రమేష్ సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు.



వేమవరపు సాయి



మేదరి శైలజ


ఎత్తుకు తగ్గ బరువున్నానా.. మేడమ్..!

పోషణ మాసోత్సవాల సందర్భంగా.. ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ కల్యాణి ఆయా కేంద్రాల పరిధిలోని చిన్నారులు వయసుకు తగ్గ బరువు, ఎత్తుకు తగ్గ బరువు ఉన్నారో పరీక్షించారు. వారి తల్లిదండ్రులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.

– న్యూస్‌టుడే, హుజూర్‌నగర్



కరవు నేలకు గోదారి.. పూజలతో ప్రణమిల్లి..!



మల్లన్నసాగర్ జలాశయం నుంచి గోదావరి జలాలు వదలడంతో.. తుర్కపల్లి మండలంలోని గంధమల్ల చెరువు నిండింది. అలుగు పోస్తుండటంతో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బుధవారం గంగకు పూజలు చేస్తున్న దృశ్యమిది.

–న్యూస్‌టుడే, తుర్కపల్లి

పాలేరు వరకు నీటి విడుదల



కేఆర్సీపురం వద్ద ఎడమ కాల్వకు గండిపడిన చోట ఏర్పాటు చేసిన ఇసుక బస్తాలు

నడిగూడెం, న్యూస్‌టుడే: సాగర్ ఎడమ కాల్వలో బుధవారం రాత్రి పాలేరు వరకు సాగు నీరు విడుదల చేశారు. ఎడమ కాల్వకు రెండు చోట్ల గండ్లు పడటంతో కాల్వలకు సాగునీటి విడుదలను నిలుపుదల చేశారు. అనంతరం ఎడమ కాల్వ పరిధిలో 128 కి.మీ. వద్ద క్రాస్ బండ్ ఏర్పాటు చేసి అక్కడివరకు సాగునీరు విడుదల చేశారు. గండి పరిసర ప్రాంతంలో సాగులో ఉన్న పంట పొలాలు ఎండుతున్నాయని మంత్రి ఉత్తమ్ పర్యటనలో రైతులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఎడమ కాల్వకు పూర్తి స్థాయిలో సాగునీరు విడుదల చేయాలని మంత్రి అధికారులను ఆదేశించడంతో క్రాస్ బండ్‌ను అధికారులు పొక్లెయిన్‌తో బుధవారం రాత్రి తొలగించారు. దీంతో ఎడమ కాల్వ పరిధిలో పాలేరు వరకు సాగర్ నీరు చేరేందుకు మార్గం సుగమమైంది. 132 కి.మీ. వద్ద గండి పూడ్చిన అధికారులు కాల్వ కట్ట పైవరకు ఇసుక బస్తాలను రక్షణ గోడగా ఏర్పాటు చేశారు. ఇంకా రెండు అడుగుల మేర బస్తాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం కాల్వలో 5 నుంచి 6 అడుగుల మేరకే నీటి ప్రవాహం కొనసాగుతోంది. కాల్వలో నీటి మట్టం పెరిగేలోగా ఇసుక బస్తాల ఏర్పాటు పూర్తవుతుందని, ఈ లోగా నీటి విడుదలకు సమస్య లేదని భావించి అధికారులు కాల్వకు నీరు విడుదల చేశారు. గండి ప్రాంతం వరకు సాగు నీరు రావడంతో 25 రోజులుగా సాగునీటికి నోచుకోని కాగితరామచంద్రాపురం రైతులు హర్షం వ్యక్తం చేశారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

క్రోచెట్ ఈవెంట్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డు



దేవరకొండ, న్యూస్‌టుడే: క్రోచెట్ ఈవెంట్‌లో దేవరకొండ పట్టణానికి చెందిన వీరమళ్ల కృష్ణయ్య కుమార్తె గుండా సంతోషి, ఆమె బృందం వరల్డ్ రికార్డ్ కైవసం చేసుకుంది. ఏపీలోని విశాఖపట్టణానికి చెందిన మహిళ మనోవికాస్ అండ్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే క్రోచెట్ తయారీలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు గుండా సంతోషి. ఆ సంస్థ గతేడాది నవంబరు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు మొత్తం 450 మందితో చిన్నారులు, యువతులు, వృద్ధులతో కలిసి అతి తక్కువ సమయంలో 58112 క్రోచెట్స్‌ను ప్రదర్శించడంతో ఈ రికార్డును దక్కించుకున్నారు. గిన్నిస్ రికార్డ్ లండన్ ప్రతినిధి స్వప్నిల్ డంగారికర్ పరిశీలించి ఈ రికార్డును ధ్రువీకరించారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డు అందుకుంటున్న గుండా సంతోషి

ఆ కార్యాలయాలు మళ్లీ వచ్చేస్తున్నాయ్!

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: ప్రాథమిక, మాధ్యమిక విద్యలను మరింత బలోపేతం చేసేందుకు, పాఠశాలల నిర్వహణపై పర్యవేక్షణ పెంచేందుకు ప్రభుత్వం జిల్లా ఉప విద్యాధికారి కార్యాలయాలను తిరిగి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుంది. 2014లో తెలంగాణ ఏర్పాటైన తరువాత అప్పటి ప్రభుత్వం 2015లో జిల్లా ఉప విద్యాధికారి కార్యాలయాలను ఎత్తివేసింది. మండల విద్యాధికారులే ఒకటి నుంచి పది తరగతుల వరకు పాఠశాలలను పర్యవేక్షించే ఏర్పాటు చేశారు. తెలంగాణలో 10 జిల్లాలను 33 జిల్లాలకు పెంచటంతో అదనంగా జిల్లాలకు 21 మంది డీఈవోలు, 28 మంది డిప్యూటీ ఈవోలు, 59 మంది ఎంఈవోలు, ఐదుగురు ఏడీలు అవసరమని ప్రతిపాదించారు. దీనిలో భాగంగా ఎంఈవోలను అన్ని మండలాలకు రెండు రోజుల క్రితం కేటాయించగా జిల్లా ఉపవిద్యాధికారి కార్యాలయాలను సైతం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

◆ ఉమ్మడి జిల్లాలో గతంలో ఐదు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో జిల్లా ఉపవిద్యాధికారి పోస్టులు ఉండగా.. అదనంగా మూడు చోట్ల కోదాడ, హుజూర్‌నగర్, చౌటుప్పల్‌లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అన్ని చోట్ల జిల్లా ఉప విద్యాధికారి పోస్టులు ప్రారంభమైతే ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఎంఈవోలు, ఆరు నుంచి పదో తరగతి వరకు జిల్లా ఉపవిద్యాధికారులు పర్యవేక్షించనున్నారు.



మిర్యాలగూడలో ఖాళీగా ఉన్న జిల్లా ఉపవిద్యాధికారి కార్యాలయం

ఉమ్మడి జిల్లాలో ఉపవిద్యాధికారి కార్యాలయాలు ఇవే:

- నల్గొండ జిల్లాలో.. మిర్యాలగూడ, నల్గొండ, దేవరకొండ
- సూర్యాపేట జిల్లాలో గతంలో ఉన్న సూర్యాపేట కార్యాలయం పునరుద్ధరించటంతో పాటు అదనంగా కోదాడ, హుజూర్‌నగర్.
- యాదాద్రి భువనగిరి జిల్లాలో గతంలో ఉన్న భువనగిరి కార్యాలయాన్ని పునరుద్ధరించటంతో పాటు.. చౌటుప్పల్

ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే ప్రారంభిస్తాం: భిక్షపతి, డీఈవో

జిల్లా ఉపవిద్యాధికారి కార్యాలయాలను ప్రారంభించమని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ప్రారంభిస్తాం. ప్రస్తుతం ఎంఈవో పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ చేశారు. అన్ని చోట్ల అధికారులు విధుల్లో చేరారు.

ఫార్మసిస్టుల విధులు కీలకం

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: వైద్య సేవల్లో ఫార్మసిస్టుల విధులు కీలకమని డీఎంహెచ్‌వో డాక్టర్ యశోద అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం పురస్కరించుకొని భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం ఫార్మసిస్టుల ర్యాలీని జెండా ఊపి ఆమె ప్రారంభించారు. పాత మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శిల్పిని, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ మనోహర్, డీఎంవో రామకృష్ణ, సాయిశోభ, జిల్లా ఫార్మసిస్టు యూనియన్ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ యశోద

భువనగిరి గ్రామీణం: రాయగిరి ఫార్మసీ కళాశాలలో బుధవారం వరల్డ్ ఫార్మసిస్ట్ డే వేడుకలు నిర్వహించారు. కళాశాల చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫార్మసిస్టులు ఆరోగ్య రక్షణ రంగ వ్యవస్థలో అంతర్భాగమన్నారు. విద్యార్థులకు రంగోలి, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పల్లె గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ అంపటి శ్రీనివాస్, అధ్యాపకులు ప్రియాంక, అనిత, సాహితీ, ఇస్మాయిల్, దివ్య, సుజాత, అమర్నాథ్, నాగరాజ్, మహేష్, బాలరాజు పాల్గొన్నారు.

భాజపాపై విశ్వాసంతో సభ్యత్వాల స్వీకరణ

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: దేశ ప్రజలకు భాజపాపై విశ్వాసం పెరగడంతో స్వచ్ఛందంగా సభ్యత్వాలను స్వీకరిస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ధర్మోజిగూడెం గ్రామంలో పార్టీ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండల ప్రధాన కార్యదర్శి పక్కీరు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు గునుగుంటి స్వామిగౌడ్, పిసాటి దామోదర్‌రెడ్డి, గుర్రం రవీందర్, వట్టి లింగస్వామి, కొంతం కృష్ణారెడ్డి, పిసాటి నర్సిరెడ్డి, లింగారెడ్డి, పెద్దులయాదవ్, శ్రీశైలం పాల్గొన్నారు.


ధర్మోజిగూడెంలో సభ్యత్వాన్ని అందజేస్తున్న డా.మనోహర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో భాజపా నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం చేపట్టారు. పార్టీ రాష్ట్ర నాయకుడు తుమ్మల మురళీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అత్యధికంగా సభ్యత్వ నమోదు చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుజరాజ్ కాశీనాథ్, నాయకులు ప్రశాంత్, అబ్బాస్, వెంకటయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్ గురుకుల సాయుధ మహిళా డిగ్రీ కళాశాలలో ఏవో తెలంగాణ బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ హైదరాబాద్ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి ఎన్‌సీసీ సీట్ల ఎంపిక నిర్వహించారు. లెఫ్టినెంట్ కల్నల్ కమాండింగ్ ఆఫీసర్ ఆనంద్‌రావు పాల్గొన్నారు. కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం నిర్వహించిన ఎన్‌సీసీ ఎంపికలో కళాశాల మహిళా క్యాడెట్లు పాల్గొన్నారు. డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు, కళలు, పెయింటింగ్, యోగా, తబలా, మ్యూజిక్ వాయిద్యాల నిర్వహణ, పబ్లిక్ స్పీకింగ్, ఇంటర్ మార్కులు మెరిట్ ఆధారంగా 65 మహిళా క్యాడెట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిరూప, అధికారి క్యాడెట్ డాక్టర్ రూప, వైస్ ప్రిన్సిపల్, ఎన్‌సీసీ ఏఎన్‌ఎం డాక్టర్ శ్రీలత, ప్రతిభ, ఏడీఐ రవి, ఏడీఐ రాము పాల్గొన్నారు.


గౌరవవందనం స్వీకరిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ కమాండింగ్ అధికారి

గంధమల్లకు జలకళ

❒ పెరగనున్న భూగర్భ నీటిమట్టం


మరోసారి గోదావరి జలాలకు నోచుకోనున్న కొలనుపాక పిన్న చెరువు


అలుగు పోస్తున్న గంధమల్ల చెరువు

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు నియోజకవర్గానికి పెద్ద దిక్కుగా ఉన్న గంధమల్ల చెరువు అలుగు పోస్తుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. నియోజకవర్గంలో ఈసారి సాధారణ వర్షపాతమే నమోదు కావడంతో చాలా వరకు చిన్ననీటి వనరులైన చెరువులు, కుంటలు నిండ లేదు. కనీసం వాగులు సైతం జలకళకు నోచుకోలేదు. ఈ నెల 22న ఆలేరులో జరిగిన మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరైన మంత్రి కోమటిరెడ్డికి ప్రభుత్వవిప్, స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గంధమల్ల చెరువును నింపాలని కోరారు. ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మల్లన్నసాగర్ నుంచి గంధమల్ల చెరువును నింపుతామని హామీనిచ్చారు. ఇచ్చిన హామీ మేరకు గత మూడు రోజులుగా గంధమల్లకు మల్లన్నసాగర్ కాలువ ద్వారా నీరు చేరడంతో బుధవారం నుంచి అలుగు పోస్తోంది. ఇది అలుగు పారితే రాజపేట మండలం మీదుగా కొలనుపాక, ఆలేరు పెద్ద వాగులోకి..అక్కడి నుంచి మోత్కూరు బిక్కేరు వాగులో నీరు ప్రవహిస్తుంది. సుమారు 40 కి.మీ మేర బాలేరు, బిక్కేరు వాగులు విస్తరించి ఉంది. గంధమల్ల అలుగునీరు వాగులోకి చేరి ప్రవహిస్తే వాగు పరీవాహక ప్రాంతంలో భూగర్భ జలమట్టం పెరగడం, బావులు, బోర్లలోకి నీరు చేరేందుకు అవకాశం ఉంటుంది.

రైతులకు కాస్త ఉపశమనం

నియోజకవర్గంలో ఆలేరు, రాజపేట మండలాలు కరవు ప్రాంతాలుగా గుర్తింపు ఉంది. ఒకప్పుడు నల్గొండ ఉమ్మడి జిల్లాలోనే కొలనుపాక పెద్ద రెవెన్యూ గ్రామంగా ఉండి పది వేలకు పైగా జనాభా ఉంది. నాలుగు సంవత్సరాల క్రితం 450 అడుగుల లోతు వరకు భూగర్భ జలమట్టం పడిపోయింది. కొలనుపాకను ప్రభుత్వం తీవ్ర కరవు ప్రాంతంగా ప్రకటించింది. బోర్ల తవ్వకాన్ని నిషేధించింది. కరవు ఛాయలతో వందల కుటుంబాల వారు కూలీలుగా మారారు. కొందరు వలస బాటపట్టారు. నాలుగు సంవత్సరాలుగా వర్షాలు అనుకూలిస్తుండటం, కొన్ని గొలుసుకట్టు చెరువుల్లోకి తాత్కాలిక పద్ధతిన నదీ జలాలతో నింపుతుండటంతో భూగర్భ జలమట్టం కొంత మేరకు పెరిగింది. సాగు విస్తీర్ణం పెరిగింది. ఈసారి కూడా తాత్కాలిక పద్ధతిన ఆలేరు, కొలనుపాకలోని పిన్న చెరువుకు, రాజపేట మండలంలోని కొన్ని చెరువులను నింపుతామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రకటించడం పట్ల రైతుల్లో కొంత సంతోషం నెలకొంది.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80082 78928 80085 74375

బొమ్మలరామారం, న్యూస్‌టుడే:

? బొమ్మలరామారం ప్రధాన కూడలిలోని చెట్టు నరికి వేయడంతో వేర్లను (అడుగుభాగం) అక్కడనే వదిలివేశారు. వాహనదారులకు ప్రమాదకరంగా ఉంది.

–వెంకటేశం , బొమ్మలరామారం.

✔ గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలియజేసి చెట్టు వేర్లను తీసివేయిస్తాం.

పద్మజ, పంచాయతీ కార్యదర్శి

అవకతవకలపై విచారణకు డిమాండ్

మోటకొండూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అవకతవకలపై కలెక్టర్ విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులతో బుధవారం సమావేశమై మాట్లాడారు. మండలంలో రైతులకు సంబంధించిన భూములను రెవెన్యూ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై దస్త్రాలు తారుమారు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు బోలగాని జయరాములు, నాయకులు పాల్గొన్నారు.

తిరుపతి లడ్డూ అపవిత్రతపై నిరసన

సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే: తిరుమలలో పవిత్రమైన ప్రసాదం లడ్డూను అపవిత్రం చేసిన దుర్మార్గులను శిక్షించాలని మండల కేంద్రంలో విశ్వహిందు పరిషత్తు మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. అంతకుముందు స్థానిక రామాలయంలో విశ్వహిందు పరిషత్తు మండల కమిటీ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి గరిశే శేకర్ మాట్లాడారు. మండల అధ్యక్షుడు ఐతరాజు స్వామి, గిరి, యాదగిరి, బాలకృష్ణ, ముత్యాలు, శశికాంత్, సాయి, జక్కిడి సందీఫ్, ఉపేందర్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆందోళన

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల దారిని కబ్జా చేసిన వారిపై అధికారులు వెంటనే స్పందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజు అన్నారు. పాఠశాల దారిని కబ్జా చేసిన నిర్మాణనాన్ని వెంటనే కూల్చివేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో గంగదేవి సాయినాథ్, సిద్దగోని పరమేష్ పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లిలో ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాం: ఎమ్మెల్యే

తుర్కపల్లి, న్యూస్‌టుడే: ఆలేరు నియోజకవర్గానికి సాగు, తాగు నీరందించి సస్యశ్యామలం చేస్తామని విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. గోదావరి జలాలతో గంధమల్ల చెరువు నిండి అలుగు పోస్తుండటంతో కత్వా వద్ద ఆయన బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలు విడుదల చేశామని తెలిపారు. వాసాలమర్రి, కొండాపురం, మల్కాపురం, పల్లెపహాడ్, గోగులగుట్టతండా, రుస్తాపురం తదితర ప్రాంతాలలో సాగునీటి కాలువలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఐనాల చైతన్యరెడ్డి, మదర్ డెయిరీ ఛైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శంకర్‌నాయక్, భాస్కర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నర్సింహులు, రాములు, వెంకటేశం, పట్టునాయక్ పాల్గొన్నారు.


గంధమల్ల రిజర్వాయర్ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, కాంగ్రెస్ నాయకులు, అధికారులు

రాజపేట: పొట్టిమర్రి వాగు వద్ద ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లి, సాదువెల్లి, మాసాయిపేట, సైదాపురం ప్రాంతాలకు నీటి ప్రయోజనం కలిగేందుకు పొట్టిమర్రి వాగువద్ద ప్రత్యేకంగా నిర్మాణం చేసిన షెట్టర్‌ను ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెరిచారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో శోభారాణి, తహసీల్దారు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్.మహేందర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన

తుర్కపల్లి, న్యూస్‌టుడే: తుర్కపల్లి మండలం రాంపురంలోని మోడల్ స్కూల్‌లో ఆర్థిక అక్షరాస్యత, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆర్‌బీఐ, లీడ్ బ్యాంకు సంయుక్తంగా బుధవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆర్‌బీఐ జనరల్ మేనేజరు అనూజ్‌రంజన్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సురక్షా బీమా, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఆర్థిక అవసరాలను గుర్తించి డబ్బుని పొదుపుగా వినియోగించాలని పేర్కొన్నారు. డీజీఎం జదీశ్‌కుమార్, ఏజీఎం గోమాతి, జిల్లా ఎల్‌డీఎం శివరామకృష్ణ, వంశీ, సాయి, నాగరాజు, నవీన్, మాధవి, శ్రీశైలం, రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌బీఐ జనరల్ మేనేజరు అనూజ్‌రంజన్

మెరుగైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్

రామన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ హనుమంత్ కె.జెండగే అన్నారు. రామన్నపేట ప్రాంతీయ ఆసుపత్రిని బుధవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. దస్త్రాలు పరిశీలించి, వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలన్నారు. ఆసుపత్రిలో గర్భిణులకు వైద్య సేవలు అందించడానికి గైనకాలజిస్టు, రేడియాలజిస్టును నియమిస్తామని తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో వర్షపు నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని సిబ్బందికి సూచించారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టరు చిన్నానాయక్, తహసీల్దారు లాల్‌బహదూర్, ఎంపీడీవో యాకుబ్‌నాయక్, డాక్టరు ఈశ్వర్ పాల్గొన్నారు.



రామన్నపేట ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టరు హనుమంత్ కె.జెండగే

పైపులైన్ల లీకేజీలతోనే నీటి కాలుష్యం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: మంచినీటిని సరఫరా చేసే పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే ఆ నీరు కలుషితమయ్యే అవకాశముంటుందని మిషన్ భగీరథ శాఖ చౌటుప్పల్ డీఈ దీనదయాళ్‌రావు పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరంలో ఆయన బుధవారం మాట్లాడారు. కలుషిత నీటిని తాగితే అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందన్నారు. పైపులైన్లకు, నల్లాలకు ఎలాంటి లీకేజీలున్నా గమనించగానే సరి చేయాలని సూచించారు. వాటికి మరమ్మతులు చేయడంలో నిపుణులు శిక్షణనిచ్చారు. ఏఈ విశాల్‌రెడ్డి, రీసోర్స్ పర్సన్ శేఖర్ పాల్గొన్నారు.

తెచ్చారు.. నాటడం మరిచారు

బొమ్మలరామారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎండిపోయిన హరితహారం మొక్కలు అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. నెలరోజుల క్రితం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నాటేందుకు గానూ నర్సరీ నుంచి వివిధ రకాల పండ్లు, పూల మొక్కలు తీసుకొచ్చారు. కానీ నాటడం మరిచిపోయారు. దీంతో అవి ఎండిపోయి పనికిరాకుండా పోయాయి. ఈ విషయమై ఎంపీడీవో రాజ త్రివిక్రమ్‌ను వివరణ కోరగా.. కార్యాలయం ఆవరణలో ఉన్న మొక్కలను వెంటనే ప్రాంగణంలో నాటుతామని పేర్కొన్నారు. – బొమ్మలరామారం, న్యూస్‌టుడే



మూసేయరు.. నగదు ఉండదు

పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకుకు చెందిన ఏటీఎంలు పనిచేయడం లేదు. కనీసం ఇలా సూచికలు కూడా ఏర్పాటు చేయడం లేదు. కొన్ని రోజులుగా ఈ సమస్య ఉన్నప్పటికీ బ్యాంకు అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై బ్యాంకు మేనేజర్ రాఘవ వివరణ కోరగా ఏటీఎంలు చెడిపోయిన విషయం వాస్తవమేనని, కొత్త ఏటీఎంలకు ప్రతిపాదన జరిగిందని, త్వరలో రానున్నట్లుగా పేర్కొన్నారు. -న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట పట్టణం



మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

వలిగొండ, న్యూస్‌టుడే: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దని జిల్లా ప్రోగ్రామ్ అధికారి సుమన్‌కల్యాణ్ అన్నారు సంగెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలు, సీజనల్ వ్యాధుల గురించి విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించి మాట్లాడారు. మానసిక సమస్యలు ఉంటే కలత చెందకుండా మానసిక వైద్య నిపుణులను సంప్రదించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి మధుసూదన్, వైద్యాధికారిణి జ్యోతి, హెచ్ఈవో ఇస్తారి, పీహెచ్ఎన్ సుకన్య, నాగమణి, వరకుమారి, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




పాఠశాలలో బీఐఎస్ సదస్సు

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్ మండలం కొండమడుగు జడ్పీ హెచ్ఎస్‌ను బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) ప్రతినిధులు బుధవారం సందర్శించారు. పాఠశాల విద్యార్థులకు పలు అంశాలపై ప్రతినిధులు ప్రభాకర్, శ్రీకాంత్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సురేశ్‌రెడ్డి, నాగవర్ధన్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, గైడ్ టీచర్ ప్రతిమ పాల్గొన్నారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట పాత బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి(40) మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బస్టాండ్‌లోని బెంచిపై పడుకొని ఉన్న వ్యక్తి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉలుకు, పలుకు లేకపోవడంతో అక్కడ విధులు నిర్వర్తిస్తున్న కంట్రోలర్ గొల్లూరి ఇస్తారి గమనించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి చనిపోయినట్లుగా గుర్తించారు. కంట్రోలర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పంచనామా నిమిత్తం భువనగిరిలోని జిల్లా ఆసుపత్రికి తరలించినట్లుగా సీఐ పేర్కొన్నారు.



ఉరేసుకొని బలవన్మరణం

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోలోని ఆర్బీనగర్‌లో బుధవారం చోటుచేసుకుంది. నిందిగొండ శివశంకర్(40) మెయిన్‌రోడ్డులో మిర్చీబజ్జీల బండి నిర్వహిస్తున్నాడు. బండి నిర్వహించేందుకు బుధవారం ఉదయం 10 గంటల సమయంలో షెట్టర్ వద్దకు వెళ్లాడు. మధ్యాహ్న భోజనానికి రాకపోవడంతో భార్య షెట్టర్ వద్దకు వెళ్లింది. షెట్టర్ తెరిచి చూడగా అప్పటికే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పుల బాధతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు.

విద్యుదాఘాతంతో గాయాలు

వలిగొండ, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని వెలువర్తి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. 108 సిబ్బంది కథనం ప్రకారం... మండలంలోని వెలువర్తి గ్రామానికి చెందిన పిట్టల రవి ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. తన ఇంట్లో నీళ్ల మోటారుకు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. సమాచారంతో వెళ్లిన అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

గృహిణి ఆత్మహత్యాయత్నం

వలిగొండ: కుటుంబ కలహాలతో గృహిణి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండలంలోని ఏదుల్లాగూడెంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. 108 సిబ్బంది, స్థానికుల కథనం ప్రకారం... ఏదుల్లాగూడెం గ్రామానికి చెందిన బర్మ మధు భార్య అఖిల గృహిణి. కుటుంబ కలహాలతో కలత చెంది అఖిల ఇంట్లో ఫినాయిల్ తాగింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ వాహనంలో భువనగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సిబ్బంది, స్థానికులు తెలిపారు.

సఫాయి మిత్ర సురక్షా శిబి


మోటకొండూరులో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

మోటకొండూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో పారిశుద్ధ్య కార్మికులకు ఎంపీడీఓ ఇందిర ఆధ్వర్యంలో సఫాయి మిత్ర సురక్షా శిబిరం బుధవారం నిర్వహించారు. మండల వైద్యాధికారి విజయ్ మాట్లాడుతూ.. 80 మందికి పరీక్షలు నిర్వహించామన్నారు.

గుండాల : పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు నిర్వహించే క్రమంలో వారు పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో ఎ.దేవిక పంచాయతీ సిబ్బందికి సూచించారు. బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బందికి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. మండల వైద్యాధికారి హైమావతి పాల్గొన్నారు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని చౌటుప్పల్‌లో మహిళలు ప్రతిజ్ఞ చేశారు. పురపాలిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'స్వచ్ఛత హీ సేవ' పక్షోత్సవాల్లో స్థానిక మహిళలు బుధవారం పాల్గొన్నారు. మల్లికార్జున స్కూలులో విద్యార్థులకు 'స్వచ్ఛ చౌటుప్పల్‌లో నా బాధ్యత' అంశంపై వ్యాస రచన పోటీ నిర్వహించారు. పుర కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, పుర ఉప ఛైర్మన్ బత్తుల శ్రీశైలం, వార్డు కౌన్సిలర్ సందగళ్ల విజయ పాల్గొన్నారు.

వయోవృద్ధుల వారోత్సవాలు

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని అక్టోబరు 1 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న వృద్ధాశ్రమంలో క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు, ఈ నెల 27న వాక్‌థాన్ అవగాహన సదస్సు, 28న తల్లిదండ్రుల పోషణ చట్టం నియమావళిపై అవగాహన సదస్సు, 29న గ్రామ స్పెషల్ అధికారులకు, పంచాయతీ సెక్రెటరీలకు తల్లిదండ్రుల పోషణ చట్టంపై అవగాహన సదస్సు, 30న అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహణ, అక్టోబరు 1న జిల్లా స్థాయి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ ఉత్తమ సేవలను అందించినందుకు గాను డీజీపీ జితేందర్, లాఅండ్‌ఆర్డర్ డీజీ మహేశ్ భగవత్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ మహిళా పోలీస్ స్టేషన్‌లో పని చేసే సమయంలో అక్కడి ప్రజలకు మెరుగైన సేవలను అందించినట్టు పోలీసు ఉన్నతాధికారులు గుర్తించి ఈ మేరకు అభినందించారు.


డీజీపీ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్

పీఆర్‌టీయూ నూతన కమిటీ ఎన్నిక

గుండాల, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు జంపాల రాజు, ప్రధానకార్యదర్శి గొడుగు బాలరాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా గవ్వల మల్లేశం, కార్యదర్శిగా కూరెల్ల రవి, మహిళా కార్యదర్శిగా ఉమారాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ధర్మారపు వెంకటయ్య, పీఆర్‌టీయూ రాష్ట్ర, జిల్లా బాధ్యులు గోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, పురుగుల రాములు, మన్నే

'ప్రశస్త్' సర్వేకోసం శిక్షణ

చౌటుప్పల్, న్యూస్‌టుడే: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 'ప్రశస్త్' సర్వే నిర్వహించాలని చౌటుపల్ రీసోర్స్ పర్సన్ మారుపాక భాస్కర్ ఉపాధ్యాయులను కోరారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రశస్త్ సర్వేపై నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26 నుంచి అక్టోబరు 26 వరకు ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులందరికీ 60 అంశాలపై ప్రాథమిక సర్వే నిర్వహించి వారిలో శారీరక, మానసిక లోపాలను గుర్తించాలని కోరారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కర్నె శివకుమార్ పాల్గొన్నారు. పంతంగి, కొయ్యలగూడెం, నేలపట్లలో సమావేశాలు నిర్వహించారు.

'గాంధీ'లో శిశువు అపహరణ

❒ కొద్దిగంటల్లోనే ఛేదించిన పోలీసులు

గాంధీ ఆసుపత్రి, న్యూస్‌టుడే: గాంధీ ఆసుపత్రి నుంచి రెండ్రోజుల వయసున్న మగ శిశువు అపహరణకు గురికావడం కలకలం రేపింది. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కొద్ది గంటల్లోనే శిశువును తల్లిదండ్రులకు చెంతకు చేర్చారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. నల్గొండ జిల్లా గుండాల మండలం మోత్కూర్ గ్రామానికి చెందిన సుభాన్, షాహినా దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు. మూడోసారి గర్భం దాల్చిన షాహినా నొప్పులు రావడంతో ఈ నెల 24న గాంధీ ఆసుపత్రిలోని మాతా శిశు సంక్షేమ కేంద్రం (ఎంసీహెచ్)లో చేరారు. అదే రోజు ఉదయం 10.30 గంటలకు బాబుకు జన్మనిచ్చింది. 11.30 గంటలకు కొన్ని పరీక్షలు చేయాల్సి ఉండగా.. బాబును అక్కడే వదిలేసి వెళ్లింది. తిరిగి వచ్చేసరికి శిశువు కనిపించకపోవడంతో ఆసుపత్రి వర్గాల సాయంతో అవుట్ పోస్ట్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ఓ మహిళ బాబును అపహరించినట్లు గుర్తించారు. ఫొటో ఆధారంగా నాచారంలో ఉంటున్న బిహార్‌కు చెందిన పూజాదేవిగా తేల్చారు. నేరుగా నిందితురాలి ఇంటికి వెళ్లి ఆమెను అదుపులోకి తీసుకొని.. బాబును

పండిట్ దీన్‌దయాళ్‌కు ఘన నివాళులు



భాజపా జిల్లా కార్యాలయంలో పండిట్ దీన్ దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భువనగిరి, న్యూస్‌టుడే: సంఘ సంస్కర్త పండిట్ దీన్‌దయాళ్ జయంతి వేడుకలను భాజపా జిల్లా కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. దీన్ దయాళ్ చిత్రపటానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ మాట్లాడుతూ.. పండిట్ దీన్ దయాళ్ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామప్రసాద్ ముఖర్జీతో కలిసి పార్టీని విస్తరించారన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ మాయ దశరథ, పార్టీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, చందా మహేందర్‌గుప్తా, రత్నపురం బలరాం, నర్ల నర్సింగ్‌రావు, శ్యాంసుందర్‌రెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.

తుర్కపల్లి : తుర్కపల్లిలో భాజపా నాయకులు బుధవారం భారతీయ జన సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని నిర్వహించారు. భాజపా మండల అధ్యక్షుడు బానోతు శత్రునాయక్ పాల్గొన్నారు.

మోటకొండూరు : మండల కేంద్రంలో భాజపా మండల అధ్యక్షుడు తండ కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు భారతీయ జన సంఘ్ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు.

చౌటుప్పల్‌గ్రామీణం: జన సంఘ్ వ్యవస్థాపకులు పండిట్ దీన్‌దయాళ్ జయంతిని భాజపా ధర్మోజిగూడెం గ్రామశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


ధర్మోజిగూడెంలో..

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలో భాజపా ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు సుర్వి రాజుగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరు వీరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బచ్చనగోని దేవేందర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ పాల్గొన్నారు.

మోత్కూరు : దీన్ దయాళ్ జయంతి ఉత్సవాలను మోత్కూరులో నిర్వహించారు. జిల్లా కోశాధికారి సోమనర్సయ్య, పట్టణాధ్యక్షుడు పోచం సోమయ్య పాల్గొన్నారు.